క్లుప్తంగా

వైభవంగా లక్ష కుసుమార్చన



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరు పాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి లక్షమల్లెల కుసుమార్చన బుధవారం వైభవంగా జరిగింది. ప్రధాన అర్చకులు తోలేటి వీరభద్రశర్మ, గూడూరు శివరామకృష్ణశర్మ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం లక్షమల్లెలతో కుసుమార్చన కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్ గంగాశ్రీదేవి పర్యవేక్షణ చేశారు.

రామకోటయ్యకు ఘన నివాళి



ముదినేపల్లి రూరల్: మండలంలోని చిగురుకోటకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోమటి రామకోటయ్యకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) బుధవారం నివాళులర్పించారు. పార్టీ ముదిరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్ తండ్రి రామకోటయ్య ఇటీవల మృతి చెందగా బుధవారం సంస్మరణ కార్యక్రమం జరిగింది. రామకోటయ్య చిత్రపటానికి డీఎన్నార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ముదినేపల్లి, మండవల్లి ఎంపీపీలు రామిశెట్టి సత్యనారాయణ, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన



పమిడిముక్కల: మండలంలోని తాడంకిలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం శ్రీకారం చుట్టారు. వేద పండితులు కుందుర్తి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలతో గ్రామస్తులతో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. రామకోటి పుస్తకాలు, శ్రీరామ్ అని రాసి ప్రత్యేకంగా పూజలు చేసిన ఇటుకలతో భక్తులు వాస్తు హోమం, పూర్ణాహుతి జరిపించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, మాజీ సర్పంచ్ జక్కా శ్రీనివాసరావు, వ్యాపారవేత్త వెంకట సాంబశివరావు, సుధాకర్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చెరువునీటి స్వచ్ఛతకు చర్యలు

మండవల్లి: మండవల్లి మొగలి చెరువు, కొండరాయి చెరువులోని నీరు పచ్చగా మారడంతో కైకలూరు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సూచనల మేరకు చెరువులో స్పటిక, బ్లీచింగ్ చల్లినట్లు సర్పంచ్ మెండా ఝాన్సీ బుధవారం పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్‌బాబు, కార్యదర్శి గిరిజకుమారి పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్‌కు ఘన నివాళి



గుడివాడ/పామర్రు/కైకలూరు : గుడివాడ, పామర్రు, కైకలూరు నియోజకవర్గాల్లో మాజీ సీఎం ఎన్‌టీ రామారావు జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. అన్ని మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాలతోపాటు పలు చోట్ల ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు ఆయన అభిమానులు, టీడీపీ నాయకులు పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు.

అటు ఆంక్షలు.. ఇటు బెదిరింపులు

> ' కొల్లేరులో అక్రమంగా తవ్విన చేపల చెరువులను తొలగించండి. ఎందుకు వాటిని తొలగిస్తున్నారో స్థానికులకు అవగాహన కల్పించండి. అందుకు తగిన చర్యలు చేపట్టండి'
>
> - అటవీ శాఖను ఆదేశించిన సుప్రీంకోర్టు

> 'ఏం చేయమంటారండీ.. ఇటు సుప్రీంకోర్టు నుంచి అక్షింతలు. అటు రాజకీయ నేతల నుంచి బెదిరింపుల మధ్య అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతున్నాం. కరవమంటే కప్పకు .. విడవమంటే పాముకు కోపమన్న చందంగా మారింది మా పరిస్థితి'
>
> -పేరు చెప్పడానికి ఇష్టపడని కొల్లేరు అభయారణ్యంలో పనిచేస్తున్న ఓ అటవీ అధికారి ఆవేదన

> 'అటవీ సిబ్బంది విధులకు ఎవరైనా అడ్డువస్తే సహించేది లేదు. చట్టపరంగా చర్యలు తప్పవు'
>
> - ఉపముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు

లంక గ్రామాల్లో అటవీ సిబ్బందికి ఆటంకాలు

రెచ్చిపోతున్న కూటమి నేతలు

- రేంజర్‌ను బహిరంగంగా తిట్టి.. ఆనక క్షమాపణ చెప్పిన ప్రజాప్రతినిధి
- సుప్రీంకోర్టు ఆదేశాలకు అడుగడుగునా అడ్డంకులు
- కూటమి పాలనలో నోరెత్తలేకపోతున్న అటవీ సిబ్బంది

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఓవైపు అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను శిరసావహిస్తూ విధుల్లో ముందడుగు వేస్తున్న అటవీ సిబ్బందికి..మరోవైపు కూటమి ప్రభుత్వ పెద్దలు అడ్డుపడుతున్నారు. ఏ చర్యా చేపట్ట కూడదంటూ భీష్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొల్లేరులో అటవీ శాఖ సిబ్బందికి విధులు కత్తిమీద సాములా పరిణమిస్తున్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాలతో అక్రమ చెరువులకు గండ్లు పెట్టడానికి వెళ్లే అటవీ సిబ్బందిపైకి కూటమి నేతలు మహిళలను ఉసిగొల్పుతున్నారు. రాజకీయాలు, స్థానబలం ముందు అటవీ సిబ్బందికి ఏం చేయాలో ? ఎలా వ్యవహరించారో తెలియక పాలుపోని పరిస్థితి నెలకొంది.

బహిరంగంగానే బెదిరింపులు

ఏలూరు జిల్లా కొల్లేరు ప్రాంతంలో ఇటీవల బహిరంగ సభ జరిగింది. అక్రమ చెరువులకు అటవీ సిబ్బంది అడ్డుతగులుతున్నారంటూ కొల్లేరు అక్రమార్కులు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న టీడీపీ ప్రజాప్రతినిధికి ఫిర్యాదు చేశారు. అంతే రేంజర్ స్థాయి అధికారిపై ఆయన బహిరంగ బెదిరింపులకు దిగారు. ఆనక అధికారిని ఆఫీసుకు పిలిపించి క్షమాపణ చెప్పారు. 'కొల్లేరులో మిమ్మల్ని కట్టేస్తే నేను రాను. ఇక మీ ఇష్టం' అంటూ కైకలూరుకు చెందిన మరో ప్రజాప్రతినిధి అటవీ సిబ్బందిని హెచ్చరించారు. ఇదే మండలం చటాకాయి గ్రామంలో అక్రమ చెరువులను ధ్వంసం చేయడానికి వెళితే గ్రామం ప్రారంభంలోనే టెంట్లు వేసి సిబ్బందిని రానివ్వలేదు. గోకర్ణపురం, పందిరిపల్లిగూడెం వద్ద కూటమి నేతలు అటవీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇలాంటి ఘటనలు కొల్లేరు గ్రామాల్లో కోకొల్లలు.



అక్రమ చెరువులను ధ్వంసం చేయడానికి వచ్చిన ఫారెస్టు రేంజర్ కేపీ రామలింగాచార్యులు, సిబ్బందితో కూటమి నేతల వాగ్వాదం (ఫైల్)

అటు ఆంక్షలు.. ఇటు బేరసారాలు

కొల్లేరు పరిధిలో అటవీ సిబ్బంది ఆంక్షల చట్రంలో నలిగిపోతున్నారు. అక్రమ చెరువులను గండి కొట్టడానికి వెళ్లే సిబ్బందికి స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి వెంటనే ఫోన్లు వస్తుంటాయి. దీంతో ఏమీ చేయలేక వెనుదిరగాల్సి వస్తోంది. ఇంకొన్ని చోట్ల 'మీరు మాకు సహకరించండి..మేము మీకు చూసుకుంటాం' అనే ఒప్పందంతో కాలాన్ని నెట్టుకొస్తున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పెదపాడు, ఏలూరు, భీమడోలు, నిడమర్రు, కైకలూరు, మండవల్లి, ఆకివీడు మొత్తం ఏడు ఫారెస్టు సెక్షన్లు ఉన్నాయి. వీటి పరిధిలో అభయారణ్యాన్ని రక్షించడానికి డీఎఫ్‌వో, రేంజర్, డీఆర్వో, సెక్షన్ ఆఫీసర్లు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు, బేస్ క్యాంప్ హెల్పర్లు, కార్యాలయాల్లో సిబ్బంది ఇలా దాదాపు 85 మంది విధులు నిర్వహిస్తున్నారు. కొల్లేరు ప్రాంతాలకు చెందిన వ్యక్తులకు ఔట్ సోర్సింగ్‌లో అదే గ్రామాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఆయా గ్రామాల్లో వీరు విధులు నిర్వహించడం పెద్ద సాహసంగా మారింది. కూటమి నేతలు చెప్పినట్టుగా చేయకపోతే వీరికి ఉద్యోగాలుండవని పరోక్షంగా హెచ్చరిస్తున్నారు.

ఆడవాళ్లతో దాడులు

కొల్లేరు ఆక్రమణలు, అక్రమ పట్టుబడుల గురించి ప్రశ్నించినా, వార్తలు రాసినా బెదిరింపుల పర్వం కొనసాగుతోంది. ఈ సారి దాడుల మార్గాన్ని కొత్తగా ఎంచుకున్నారు. ఏకంగా ఆడవాళ్లను లారీల్లో తీసుకొచ్చి మరీ ఇళ్లపై దాడి చేస్తాం అంటూ భయపెడుతున్నారు. ఈ లోగా కొల్లేరు మరమ్మతుల పేరుతో గట్ల విస్తీర్ణం పెంచుకుంటున్నారు. నేతల అండదండలతో ఆక్వా చెరువుల నుంచి ఎకరాకి ఇంతని కొల్లేరు పెద్దల ముసుగులో నాయకులు డబ్బులు వసూలు చేసేస్తున్నారు. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో ఇంకెన్ని ఘోరాలు చూడాల్సి వస్తుందేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

గతంలోనూ ఇలాంటి దాడులే

కొల్లేరులో అటవీ సిబ్బందిపై ప్రస్తుతం సాగుతోన్న బెదిరింపులు, హెచ్చరికలను చూస్తుంటే...2014-2019 మధ్య కాలంలో చోటుచేసుకున్న దాడులే స్పురణకు వస్తాయి. ముఖ్యంగా 2016లో ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు పోలీసు, ఫారెస్టు శాఖలపై దాడులే ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఆ దాడుల్లో కొన్నింటిని చూస్తే..

- కొల్లేటికోట జాతర సమయంలో ఇద్దరు కానిస్టేబుళ్లను చితకబాదారు.
- మండవల్లి మండలం చింతపాడు, పులపర్రు, దయ్యంపాడు గ్రామాల్లో అటవీ సిబ్బందిని అడ్డుకున్నారు. జీపును సైతం పడేశారు.
- గుమ్మళ్ళపాడులో కోడిపందేలను అడ్డుకున్న సురేశ్, గణేశ్ అనే ఇద్దరు కానిస్టేబుళ్లను కొట్టారు.
- తన వాహనాన్ని పెద్దింట్లమ్మ దేవస్థానానికి అనుమతించలేదని ఓ మాజీ సర్పంచ్ కానిస్టేబుల్ చొక్కా చింపేశాడు.
- తమ మాటను లెక్క చేయలేదని వినోద్‌కుమార్, సునీల్‌కుమార్ అనే ఇద్దరు ఫారెస్టు అధికారులను బదిలీపై పంపించేశారు.
- ప్రస్తుతం ఇలాంటి ఘటనలే పునరావృతమవుతుండటంతో అటవీశాఖ, పోలీసు శాఖ సిబ్బందిలో ఏం చేయాలో? ఎలా ముందుకెళ్లాలో? తెలియని పరిస్థితి నెలకొంది.

దైనందిన జీవితంలో ఆటలు ఒక భాగం



జమీగొల్వేపల్లిలో ఆటలు ఆడుతున్న చిన్నారులు



ముదినేపల్లిలో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జమీగొల్వేపల్లి(పామర్రు): చిన్నారుల దైనందిన జీవితంలో ఆటలు ఒక భాగం కావాలని అప్పుడే వారు బుద్ధి వికాసం పొందుతారని గ్రంథాలయ అధికారి వి.నాగసురేష్ అన్నారు. మండలంలో జమీగొల్వేపల్లి గ్రంథాలయంలో బుధవారం ఆటల పోటీలను నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల ద్వారా చక్కటి క్రమశిక్షణ, పట్టుదల, సమయస్ఫూర్తి, ఐక్యమత్యం వంటి సద్గుణాలు అలవడుతాయని పేర్కొన్నారు.

పామర్రులో..

వేసవి శిక్షణలో భాగంగా చిన్నారులకు బుధవారం నాట్యంపై అవగాహన కల్పించామని గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీ రాణి పేర్కొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు బుధవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ రిటైర్డ్ ఉద్యోగి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థుల స్థాయిలకు అనుగుణంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.



గుడివాడలో ఆటల్లో నిమగ్నమైన చిన్నారులు

విజేతలకు శిబిరం ముగింపు సందర్భంగా బహుమతులు అందజేస్తామని లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి తెలిపారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: స్థానిక రాజేంద్రనగర్ లోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు బుధవారం కూడా కొనసాగాయి. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు క్యారమ్స్, చెస్, చిత్రలేఖనం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. జూన్ 6వ తేదీ వరకు ఈ శిక్షణ తరగతులు కొనసాగుతాయని గ్రంథాలయ అధికారి పి.శాంతి తెలిపారు.

మంచి ఆహారపు అలవాట్లతో వ్యాధులు దూరం



తోట్లవల్లూరులో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాయిప్రసన్న

తోట్లవల్లూరు: మంచి ఆహారపు అలవాట్లు పాటించటం ద్వారా వాధులకు దూరంగా ఉండవచ్చని తోట్లవల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న తెలియజేశారు. రుతుక్రమ దినోత్సవం పురస్కరించుకుని తోట్లవల్లూరులో బుధవారం అవగాహన ర్యాలీ జరిగింది. డాక్టర్ సాయిప్రసన్న మాట్లాడుతూ శుచి శుభ్రత పాటిస్తే ఆనందం మన సొంతం అవుతుందని అన్నారు. రుతుక్రమ సమయంలో న్యాప్‌కిన్స్ వినియోగించటం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. అలాగే పంచదార, ఉప్పు, నూనెలు తక్కువగా వినియోగించటం ద్వారా బీపీ, షుగర్, గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉండదని డాక్టర్ సాయిప్రసన్న చెప్పారు. సీహెచ్‌ఓ పద్మావతి, హెచ్‌వీ రోహిణి, హెల్త్ సూపర్‌వైజర్ అనిల్‌కుమార్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరేశలింగానికి ఘన నివాళులు



గుడివాడ టౌన్: మూఢనమ్మకాలు, అశాస్త్రీయ భావాలను తరిమికొట్టి తన కలంతో, గళంతో వాటిని సమాజానికి తెలియపర్చిన యోధులు కందుకూరి వీరేశలింగం పంతులు అని కమ్యూనిస్టు నాయకులు అన్నారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వీరేశలింగం వర్ధంతి జరిపారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సాహితీ స్రవంతి అధ్యక్షుడు లంకా సురేంద్ర, పీవీవీఎస్ రాజకుమారి, కె. గాంధిబాబు, ఆంజనేయులు, బి.రాధాకృష్ణ, ఐద్వా కార్యదర్శి రజిని, బి.సురేష్, మాల్యాద్రి పాల్గొన్నారు.

సినిమా హాళ్లలో పరిశుభ్రత తప్పనిసరి



పామర్రులో సినిమా థియేటర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ రవికాంత్



గుడివాడలో తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్

పామర్రు: స్థానికంగా ఉన్న సినిమా హాళ్లలో పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ జీ రవికాంత్ పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న శివరామ సినీ థియేటర్, గగన్‌మహల్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా థియేటర్లను నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధరలకు టికెట్లను విక్రయించాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా అధిక మొత్తంలో టికెట్ ధరలను విక్రయిస్తే వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. మరుగుదొడ్లలో పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాము పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్ : సినిమా థియేటర్లలో ప్రేక్షకులకు అందిస్తున్న ఆహారపదార్థాలు, పానీయాలు, ఇతర వసతులపై బుధవారం తనిఖీలు జరిగాయి. ఆర్డీఓ జి. బాలసుబ్రహ్మణ్యం, తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు సమక్షంలో తనిఖీలు జరిగాయి. క్యాంటీన్‌లలో తయారుచేసే వస్తువులు వాటికి వినియోగించే నూనె, శీతల పానీయాల తయారీ సమయం, వాటి ధరలు, అమ్ముతున్న ధరలు ప్రేక్షకులపై పడుతున్న భారం, మరుగుదొడ్లు వాటి నిర్వాహణ ఇతర విషయాలు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నెక్స్ట్, జీ3- సింధూర, బాస్కర్ థియేటర్లలో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. వీటిపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నాగబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు



సర్టిఫికెట్లు పొందిన చిన్నారులతో స్టేడియం పాలకవర్గం

గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. 14 రకాల క్రీడలకు సంబంధించి 1,325 మంది విద్యార్థులకు ఈ తరగతులు నిర్వహించినట్లు స్టేడియం కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు, శిక్షణ పొందిన బాలబాలికలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కె. రంగప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు ప్రింటర్ బహూకరణ



పమిడిముక్కల: అగినపర్రు హైస్కూల్‌కు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి, పూర్వ ఉపాధ్యాయుడు తమ్మన వేణుగోపాలరావు రూ.12 వేల విలువైన ప్రింటర్‌ను బహూకరించారు. హైస్కూల్లో బుధవారం జరగిన కార్యక్రమంలో ప్రింటర్‌ను హెచ్ఎం ఫణికుమార్‌కు అందజేశారు. దాతకు పాఠశాల విద్యాకుటుంబం తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు అబుసిబ్‌బైన్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పామర్రు: నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్న వాహనాలను తనిఖీ చేశామని పామర్రు ఎస్‌ఐ రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక పామర్రు-దిగమర్రు జాతీయ రహదారిలోని ఫ్లెఓవర్ వద్ద బుధవారం తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సరైన అనుమతులు లేని వాహనాలను నిలుపుదల చేసి వారి నుంచి అపరాధ రుసుం చెల్లించేలా చర్యలు తీసుకున్నామన్నారు. రికార్డులు సరిగా లేని వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే సారూ.. రోడ్ల సొగసు చూడండి

కాళ్లపాలెంలో అధ్వానంగా రోడ్లు



కలిదిండి (కైకలూరు): అయ్యా.. ఎమ్మెల్యే సారూ.. మా రోడ్లను ఒక్కసారి పరిశీలించండని ప్రయాణికులు వేడుకుంటున్నారు. అరుతెగళపాడు ప్రధాన రోడ్డు నుంచి కాళ్లపాలెం, కొండూరు, తాడినాడ మీదుగా విభరాంపురం, చినతాడినాడ వరకు రహదారి ఎంతో ప్రధానమైంది. నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తాయి. చిన్నపాటి వర్షం కురిస్తే కాళ్లపాలెం నుంచి తాడినాడ వరకు పలు ప్రాంతాల్లో భారీ గుంతలు ఏర్పడుతున్నాయి. వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా రహదారులకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఊరచెరువులో ఆక్రమణలు తొలగించాలి



ఆక్రమణకు గురైన చిన్నకామనపూడి ఊరచెరువు

ముదినేపల్లి రూరల్: గ్రామానికి చెందిన ఊరచెరువులో ఆక్రమణలు తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని మండలంలోని చిన్నకామనపూడి సర్పంచ్ చిట్టూరి నాంచారయ్య కోరారు. ఆర్‌ఎస్‌నెం. 34/1లో గ్రామ పంచాయతీకి 2.35 ఎకరాల్లో ఊరచెరువు ఉన్నట్లు తెలిపారు. ఈ చెరువు పక్కనే ఆర్‌ఎస్‌నెం 34/2లో 0.62 సెంట్లు పోరంబోకు భూమి ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ పోరంబోకు భూమితో పాటు ఊరచెరువులోని మరో 0.40 సెంట్లు ఆక్రమించి మాజీ సర్పంచ్ భర్త చేపల చెరువులు తవ్వి సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. చెరువును సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని అధికారులకు పలమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి వేసవి ముగిసే లోపు సర్వే చేసి ఊరచెరువు తవ్వుకునేందుకు ఆటంకాలు, ఆక్రమణలు తొలగించాలని ఆయన కోరారు.